సాక్షి ప్రకాశం

బుధవారం । 7 । మే । 2025



కుట్టు స్కీం కాదు.. కోట్లు కొల్లగొట్టే స్కామ్

మహిళలకు కుట్టు మిషన్లు, శిక్షణ పేరుతో ప్రభుత్వం మోసానికి పాల్పడిందని వైఎస్సార్ సీపీ మహిళా నేతలు ఆరోపించారు. - 8లో..



పెనుగాలుల బీభత్సం

పెనుగాలులు బొప్పాయి రైతులను అతలాకుతలం చేశాయి. ఒక్క తర్లుపాడు మండలంలోనే 197 ఎకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లింది. - 8లో..



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో వర్షం పడవచ్చు.

న్యూస్‌రీల్

కార్యదర్శిపై విచారణ

- అవినీతి జరిగినట్టు ఎలాంటి ఆధారాలు లేవని ధ్రువీకరణ
- కక్ష సాధింపు చర్యలంటూ కార్యదర్శుల ఆందోళన



విచారణ చేస్తున్న డీఎల్పీవో పద్మావతి

నాగులుప్పలపాడు: అధికార పార్టీ నాయకుల అక్రమాలకు ఊతం ఇవ్వని అధికారులపై కూటమి నేతల కక్ష సాధింపు చర్యలు మరో మారు బహిర్గతం అయ్యాయి. తమ పరిధి కాని గ్రామ పంచాయతీల పేర్లతో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఓ టీడీపీ చోటా నాయకుడు మట్టిగుంట, ఈదుమూడి, ఉప్పుగుండూరు, ఒమ్మెవరం గ్రామ పంచాయతీల్లో అవినీతి జరిగిందని ఆయా సమయాల్లో పనిచేసిన కార్యదర్శిపై విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలని గతంలో డీపీవో కు ఫిర్యాదు చేశాడు. దానిపై విచారణాధికారిగా నియమితులైన డీఎల్పీవో పద్మావతి ఇప్పటికే మూడు సార్లు విచారణ పేరుతో సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు అందజేశారు. పలుమార్లు ఫిర్యాదుదారుడు విచారణకు గైర్హాజరయ్యాడు. ఈక్రమంలో మంగళవారం మళ్లీ విచారణ చేపట్టారు. డీఎల్పీఓ విచారణకు పంచాయతీ కార్యదర్శులు, టీడీపీకి చెందిన ఫిర్యాదుదారుడు హాజరయ్యారు. ఈ విచారణ సందర్భంగా ఫిర్యాదుదారుడి వద్ద నుంచి ఆధారాలు కావాలని డీఎల్పీవో పద్మావతి అడగగా తన వద్ద పూర్తి సమాచారం లేదని చెప్పి విచారణలో సంతకం మాత్రమే చేసి బయటకు వెళ్లిపోయాడు. ఆరోపణలు చేసిన ఫిర్యాదులకు ఆధారాలు కావాలని ఫిర్యాదుదారుడిని డీఎల్పీవో అడిగినా అతని నుంచి సరైన సమాధానం లేదు. తాను పనిచేసిన కాలంలో రికార్డులు చూపించాలని ఆరోపణలు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శిని కోరగా ఎలాంటి అవకతవకలు, అవినీతి జరగలేదని తగిన రికార్డులు చూపుతూ ఆయన లిఖితపూర్వకంగా రాసిచ్చారు. దీనిపై సంతృప్తి చెందిన డీఎల్పీవో ఇదే అంశాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అధికార పార్టీ నాయకులు తమ మాట వినడానికి పంచాయతీ కార్యదర్శులపై ఇలాంటి తప్పుడు ఆరోపణలతో ఇబ్బంది పెట్టడం ఏ మాత్రం తగదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీహెచ్‌ఓల వినూత్న నిరసన



న్యాయదేవతకు వినతి పత్రం అందజేస్తున్న సీహెచ్‌ఓలు

ఒంగోలు టౌన్: జీతభత్యాలు మెరుగుపరచాలని కోరుతూ విలేజి క్లినిక్‌లలో వైద్య సేవలు అందిస్తున్న సీహెచ్‌ఓలు సమ్మె చేస్తున్నారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకునే తీరిక, ఓపిక లేనట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అంతటితో ఊరుకోకుండా సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌ఓ జీతాలను నిలిపివేసి కక్షసాధింపు చర్యలకు దిగింది. వీరి న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగడంతో సమస్యను న్యాయదేవత దృష్టికి తీసుకెళ్లాలని భావించారు. ఒక మహిళా సీహెచ్‌ఓ న్యాయదేవత పాత్ర పోషించగా మిగిలిన సీహెచ్‌ఓలు నోటికి నల్లగుడ్డలు కట్టుకొని వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్ వద్ద సీహెచ్‌ఓల దీక్షా శిబిరం వద్ద మంగళవారం కనిపించిన ఈ దృశ్యం చూపరులను ఆలోచింపచేసింది. ఈ సందర్భంగా ఏపీఎంసీపీ రాష్ట్ర గౌరవ సలహాదారులు అనుమల రామకృష్ణ మాట్లాడుతూ.. సీహెచ్‌ఓల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తాము ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఈ నిరసన దీక్షలో నాయకులు ఎం రాజేష్, జీవన జ్యోతి, ప్రసన్న, దీప్తి, కామేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కూటమిలో పదవుల కాక

జిల్లాలో వివిధ కార్పొరేషన్ పదవుల పంపకం కోసం కూటమి నేతలు పోటీపడుతున్నారు. ఎన్నికల సమయంలో పదవుల ఆశచూపి పనిచేయించుకుని తీరా అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోకుండా మొండిచేయి చూపుతున్నారంటూ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. కూటమి నేతల మధ్య సఖ్యత లేక పదవుల పంపకంలో జాప్యం జరుగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య పోటీతో పాటుగా, టీడీపీ, జనసేనలోని గ్రూపు రాజకీయాలు కూడా పదవులకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది.



- కార్పొరేషన్ పదవుల్లో జిల్లా నేతలకు మొండిచేయి
- ఒడా, పీడీసీసీ, డీసీఎంఎస్, మార్కెట్ యార్డు, జిల్లా గ్రంథాలయ సంస్థ, మైనారిటీ కార్పొరేషన్ పదవులన్నీ ఖాళీ
- కూటమి నాయకుల్లో సఖ్యత లేకే పదవులు భర్తీ చేయడం లేదంటూ ప్రచారం
- పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో తీవ్ర అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు కావస్తుంది. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన కార్పొరేషన్ పదవులను భర్తీ చేయకపోవడంతో నాయకుల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఎన్నికలకు ముందు చాలా మంది నాయకులకు పదవుల ఆశ చూపించి అన్నీ రకాలుగా వాడుకున్నారు. తీరా ఎన్నికలు పూర్తయ్యాక పదవులు భర్తీ చేయకుండా తిప్పుకోవడంపై తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు జనసేన నాయకులు కూడా పదవుల్లో వాటా అడుగుతుండడంతో అధిష్టానం ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంబిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. కార్పొరేషన్ పదవుల విషయంలో తొలుత హడావుడి చేసిన జనసేన నాయకులు ఇప్పుడు ఉశలు వదులుకొని చడీ చప్పుడు లేకుండాపోయారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఒడా పదవి కోసం పోటాపోటీ...

ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) పదవి కోసం టీడీపీ, జనసేన పార్టీల మధ్య మొదట్నుంచి తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ పదవిని జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు ఇప్పిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే సీనియర్ నాయకుడు మంత్రి శ్రీనివాస్ కూడా తనకు ఒడా పదవి కావాలని పట్టుపడుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఆయనతో పాటుగా సింగరాజు రాంబాబు సైతం ఒడా పదవి ఇవ్వాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరిగింది. స్థానిక నాయకులతో సంబంధం లేకుండా ఒడా పదవికి దర్శి మాజీ ఎమ్మెల్యే పాపారావు పేరు ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన గొట్టిపాటి లక్ష్మి కూడా ఈ పదవి కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నాయకుల మధ్య పోటీ ఎలా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అసలు పట్టించుకుంటున్నట్లు కనిపించడంలేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా ఈ పదవిని భర్తీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దాంతో ఒడా పదవిని ఆశిస్తున్న నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. మిగతా జిల్లాల్లో పదవులను భర్తీ చేసి కేవలం ఒంగోలు ఒడా పదవిని మాత్రమే ఎందుకు భర్తీ చేయడం లేదని గట్టిగా ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

పీడీసీసీ బ్యాంకు పదవి సంగతేంటో...

జిల్లాలో కీలకమైన మరో పదవి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీ) చైర్మన్. ఈ పదవిని టీడీపీ సామాజిక వర్గానికి చెందిన నాయకులకే ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దాంతో గత ఎన్నికల్లో దామచర్ల విజయం కోసం పనిచేసిన పలువురు నాయకులు ఈ పదవిపై కన్నేసినట్లు చెప్పుకుంటున్నారు. నగరంలో స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడిగా పేరున్న మండవ మురళీకృష్ణ పీడీసీసీ పదవి కోసం ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఆయనకు బదులుగా నగరంలోని ప్రముఖ వైద్యశాల నిర్వాహకుడైన డాక్టర్ సీతారామయ్య పేరును అధిష్టానం వద్ద ఎమ్మెల్యే దామచర్ల ప్రతిపాదించినట్లు సమాచారం. వీరిద్దరే కాకుండా ఇటీవల హత్యకు గురైన ముప్పవరపు వీరయ్య చౌదరి కూడా పీడీసీసీ రేసులో ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. మంత్రి నారా లోకేష్ ఈ పదవికి వీరయ్య పేరు ఖరారు చేశారని ప్రచారం జరిగింది. అయితే ఈలోపు ఆయన ఊహించని రీతిలో ఆయన హత్యకు గురయ్యారు. తాజాగా ఎమ్మెల్యే దామచర్ల పట్టుబట్టి మరీ సీతారామయ్య పేరు ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

కూటమిలో సఖ్యత లేకపోవడమే కారణమా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన పదవుల పంపకాల్లో టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా నూకసాని బాలాజీ, మారిటైం బోర్డు చైర్మన్‌గా దామచర్ల సత్యలకు పదవులు దక్కాయి. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వీరిద్దరికీ పదవులను ఇవ్వకుండా అడ్డుపడే ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. అయినా లోకేష్ ద్వారా సత్య, చంద్రబాబు ద్వారా బాలాజీ పదవులు తెచ్చుకున్నారు. పదవుల కోసం ప్రయత్నాలు చేసే వారికంటే నాకు ఇవ్వకపోయినా పర్వాలేదు, అతడికి మాత్రం ఇవ్వవద్దు అంటూ పట్టుపడుతున్నవారు ఎక్కువగా ఉంటున్నారని తెలిసింది. ఇది అధిష్టానానికి తలనొప్పిగా మారినట్లు చెప్పుకుంటున్నారు.

యార్డు పదవి ఎప్పుడు భర్తీ చేస్తారో...

మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి కూడా మంచి గిరాకీ ఉంది. పార్టీలో ఈ పదవిని ఆశిస్తున్న నాయకుల లిస్టు చాంతాడంత ఉంది. గత ఎన్నికల సమయంలో మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇస్తానంటూ దామచర్ల హామీ ఇచ్చినట్లు చాలా మంది నాయకులు చెప్పుకుంటూ తిరుగుతున్నారు. తొలుత ఈ పదవి ఎస్సీలకు రిజర్వ్ అయిందని ప్రచారం జరిగింది. నత్తల కనకారావు, శశిభూషణ్‌లతో పాటుగా నగరానికి చెందిన ఒక మహిళా వైద్యురాలు కూడా ఈ పదవి కోసం ప్రయత్నాలు చేశారు. చివరికి ఇప్పుడు బీసీలకు రిజర్వ్ చేసినట్లు తెలుస్తోంది. దాంతో బీసీల్లో యాదవ సామాజిక వర్గానికే చైర్మన్‌గిరి దక్కాలని నాయకులు పట్టుపడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి సిరిపురం వెంకటరావు, కొఠారి నాగేశ్వరరావుల మధ్య పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. దామచర్ల ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే వారికి పదవి దక్కడం ఖాయం.

మిగతా పదవులపై ఆశలు...

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మైనారిటీ కార్పొరేషన్, ఉర్దూ అకాడమీ, హజ్ కమిటీ, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య, డీసీఎంఎస్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, దేవాలయ కమిటీల పదవుల కోసం ఎవరికివారు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే ఇటు ఎమ్మెల్యేల నుంచి కానీ, అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అనివార్య పరిస్థితిలో ఎదురు చూస్తున్నారు. ఇటు మైనారిటీ, ఎస్సీ, బీసీ నాయకులు తమకు తగిన గుర్తింపు లభిస్తుందో లేదోనని పడిగాపులు కాస్తున్నారు. అంతేకాకుండా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య పోటీతో పాటుగా, టీడీపీ, జనసేనలోని గ్రూపు రాజకీయాలు కూడా పదవులకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది.

జీవో 77 వెంటనే రద్దు చేయాలి

- మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించిన ఏబీవీపీ కార్యకర్తలు
- అడ్డుకున్న పోలీసులు

ఒంగోలు సిటీ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో నగరంలోని లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద మంగళవారం జీవో నం.77 ను రద్దు చేయాలని కోరుతూ విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనానికి ఏబీవీపీ కార్యకర్తలు ప్రయత్నించగా ఒన్‌టౌన్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ జీవో నంబర్ 77 రద్దు చేయకుండా బుధవారం ఐసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఆ జీఓపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ఇవ్వకపోతే ఐసెట్ పరీక్షలను అడ్డుకుంటామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం ఎంతో సిగ్గు పడాల్సిన విషయమన్నారు. ఎన్నికల ముందు తమ ప్రభుత్వం రాగానే జీవో నంబరు 77 ను రద్దు చేస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడి నేటికి 327 రోజులవుతున్నా దానిని పట్టించుకోలేదన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి కళ్లు తెరిచి విద్యార్థుల సమస్యలు చూడాలని, పీజీ విద్యార్థుల మెడ మీద కత్తిలా తయారైన జీవో నం.77 ను ఐసెట్ పరీక్షలకు ముందే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు సుదర్శన్, గురునాథ్, శామ్యూల్, అయ్యప్ప, నరేంద్ర, ఈశ్వర్ రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనం చేయకుండా ఏబీవీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న ఒన్‌టౌన్ పోలీసులు

చెత్త రేగింది

- చెత్త పన్ను వసూలుపై కౌన్సిల్‌లో రగడ
- టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెత్త పన్ను మీద రాద్ధాంతం
- ఇప్పుడేమో బయట నుంచి మనుషులను తీసుకొచ్చి అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం
- నగర పాలక సంస్థలో అక్రమాలపై నిలదీసిన వైఎస్సార్‌సీపీ సభ్యులు..వారితో స్వరం కలిపిన జనసేన సభ్యులు
- వాడీవేడిగా ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం



సమస్యలపై నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్



మాట్లాడుతున్న మేయర్ గంగాడ

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో రగడ చోటు చేసుకుంది. వైఎస్సార్ సీపీ సభ్యులు నగర పాలక సంస్థలో జరుగుతున్న అక్రమాలు, సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తుంటే టీడీపీ సభ్యులు అడ్డుకోవటం పనిగా పెట్టుకున్నారు. ప్రతిపక్ష సభ్యులు తీసుకొస్తున్న ప్రతి అంశానికి అడ్డుతగులుతూ వచ్చారు. ఇదిలా ఉంటే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యులకు వెన్నుదన్నుగా టీడీపీ కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీ అయిన జనసేన సభ్యులు నిలిచారు. జనసేన సభ్యులు ఆయా డివిజన్లలో సమస్యలు చెబుతుంటే అసలు పట్టించుకోవటం లేదని అధికారుల తీరును దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, పార్టీ మరో సభ్యుడు గంగవరపు ప్రవీణ్ కుమార్ నగర పాలక సంస్థలో జరుగుతున్న సమస్యలపై ఏకరువు పెట్టారు.

ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ జి.సుజాత అధ్యక్షతన స్థానిక కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. సమావేశంలో 124 అంశాలు ప్రస్తావించాల్సి ఉంటే అదేమీ లేకుండానే అధికారి నంబరు చదివి మమ అనిపించారు. సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్‌సీపీ సభ్యులు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ నగరంలో చెత్త పన్ను వసూలు చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెత్త పన్నుపై రాద్ధాంతం చేసిన టీడీపీ ఇప్పుడు ఎందుకు చెత్త పన్ను పసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. అదే సమయంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తనకు కూడా రాజీవ్ కాలనీ నుంచి చెత్త పన్ను వసూలు చేస్తున్నారని ఫోన్ చేసి మరీ చెప్పారని కౌన్సిల్‌లో ప్రస్తావించారు. కర్నూలు నుంచి కొందరు వచ్చి ఆటోలు వేసుకొని ఒంగోలు నగరంలో చెత్త సేకరిస్తూ చెత్త పన్ను వసూలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ సభ్యుడు గంగవరపు ప్రవీణ్ కుమార్ కూడా కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో కమిషనర్ మున్సిపాలిటీకి, వాళ్లకు ఎలాంటి సంబంధం లేదని సమాధానం ఇచ్చారు. ఈ సమాధానంపై సభ్యులు మండిపడ్డారు. ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి శానిటేషన్ వర్కర్లను నియమించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక అనుమతి లేకుండా కార్పొరేషన్ అధికారుల సారథ్యంలో ప్రతి ఇంటికి రూ.50 వసూలు చేయిస్తున్నారని కమిషనర్‌ను నిలదీశారు. నగరంలో 80 వేల ఇళ్లు ఉంటే అక్రమంగా రూ.40 లక్షలు ఎవరి చేతుల్లోకి వెళుతున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. నాలుగు నెలల నుంచి నగర ప్రజలు తాగటానికి వీలులేని మురికి నీరు ఇస్తున్నారని ధ్వజమెత్తారు.

జనసేన సభ్యులు మలగా రమేష్ అయితే కమిషనర్ వెంకటేశ్వర రావు, ఇతర అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలోనే జనసేన కూడా ఉంది... అలాంటిది డివిజన్‌లో సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొస్తే ఒక పనిని మొదలు పెట్టి మధ్యలోనే ఆపేయించారని మండిపడ్డారు. జనసేన సభ్యులు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, జనసేన సభ్యుడు ఈదర సురేష్ బాబు మాట్లాడుతూ ఎమర్జెన్సీ కింద వర్కులకు ముందస్తు అనుమతులు తీసుకొని కూడా పనులు ప్రారంభించకుండా ఉండటానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. అలాంటప్పుడు ఎందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని నిలదీశారు. స్టాండింగ్ కమిటీ లేకపోవటంతో ముందస్తు అనుమతులు తీసుకొని పనులు ప్రారంభించకుండా ఉండటం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. స్ట్రీట్ లైట్ల విభాగంలో ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాలకు విద్యుత్ అనుభవం కానీ, ఎలక్ట్రికల్ సర్టిఫికెట్లు కానీ లేని వారిని తీసుకున్నారని వెలనాటి సభ దృష్టికి తెచ్చారు. భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు ఏరియాల్లో సాయంత్రం ఇవ్వాల్సిన నీరు మరుసటి రోజు ఉదయం ఇస్తున్నారన్నారు. జనసేన సభ్యుడు యనమల నాగరాజు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కళాక్షేత్రానికి సంబంధించి గతంలో కాంట్రాక్టర్ రూ.15 లక్షలు ఎగ్గొట్టారన్నారు. అయితే మున్సిపల్ అధికారులు అతనికి సహకరించటంతో బ్యాంకు ఉన్న గ్యారంటీ డబ్బు రూ.15 లక్షలు డ్రా చేసుకున్నాడని చెప్పారు. కౌన్సిల్ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రాజకీయాలు చేయొద్దంటూ కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

వీరయ్య కేసులో వీడుతున్న చిక్కుముడి

- పోలీసుల అదుపులో ప్రధాన పాత్రధారుడు
- కేసు చివరిదశకు రావడంతో టీడీపీ నాయకుల్లో ఆందోళన
- నిందితులంతా టీడీపీవారే కావడంతో ఏం జరుగుతుందోనన్న గుబులు



వీరయ్య చౌదరి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు చిక్కుముడి వీడుతున్నట్లేనని పోలీసులు భావిస్తున్నారు. ఈ హత్య కేసులో ప్రధాన పాత్ర పోషించినట్లు చెబుతున్న కొప్పోలుకు చెందిన ఇసుక వ్యాపారి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. అతడికి పరిచయమున్నట్లు చెబుతున్న యువకుడు మరణించడంతో ఇసుక వ్యాపారి స్వయంగా లొంగిపోయాడా లేక పోలీసులు అదుపులోకి తీసుకున్నారా అనేది తెలియాల్సి ఉంది. ఏదేమైనా అతడు పట్టుపడితేనే కానీ పూర్తి వివరాలు వెల్లడికావంటూ ఇన్నాళ్లుగా పోలీసులు చెబుతూ వచ్చారు. ఇప్పుడు అతడు దొరికిపోవడంతో దాదాపుగా కేసు ముగిసినట్టేనని తెలుస్తోంది. హత్యకు ప్రోత్సహించిన వ్యక్తులు ఎవరు, ఎవరి పాత్ర ఏమిటి, హత్యలో పాల్గొన్న హంతకులు ఎంతమంది, వారంతా ఎక్కడివారనే సమాచారాన్ని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ హత్యలో నిందితులంతా దాదాపుగా టీడీపీ నాయకులేనని పోలీసుల నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రధాన సూత్రధారిగా చెబుతున్న అమ్మనబ్రోలు టీడీపీ యువనాయకుడు పోలీసుల అదుపులోనే ఉన్నాడు. నెల్లూరుకు చెందిన మరో ఇద్దరు పాత్రధారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యలో ప్రధాన పాత్రధారి కూడా దొరికిపోవడంతో గురువారం వీరయ్య పెదకర్మలోపే పోలీసులు కేసును ఫైనల్ చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు సమాచారం.

అందరూ అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ నాయకులే...

తెలుగుదేశం పార్టీ నాయకుడు వీరయ్య చౌదరి ఏప్రిల్ 22వ తేదీ హత్యకు గురికావడం తెలిసిందే. ఈ హత్యకు పాల్పడివారంతా వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ నాయకులే కావడంతో ఈ కేసు సంచలనంగా మారింది. హత్యకు ప్రధాన సూత్రధారిగా చెబుతున్న వ్యక్తి జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. ప్రస్తుతం సంతనూతలపాడు టీడీపీలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఆయనతో పాటుగా మరో ఇద్దరు సూత్రధారులు కూడా అదే గ్రామానికి చెందిన వారిగా ప్రచారం జరుగుతోంది. హత్యకు పథక రచన నుంచి డబ్బు సమకూర్చడం కూడా వీరే చేశారని ప్రచారం జరుగుతోంది. వీరి వెనక పెద్ద తలకాల హస్తమేమన్నా ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత ఈ కేసును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు అంటగట్టేందుకు ఎల్లో మీడియా ప్రయత్నం చేసి విఫలమైందని స్థానికులు చెబుతున్నారు. హత్యకు పథకరచన చేసి, డబ్బులు సమకూర్చినవారంతా టీడీపీ నాయకులేనని తేలడంతో వారు చేతులెత్తేశారని చెప్పుకుంటున్నారు.

టీడీపీ నాయకుల్లో కలకలం...

వీరయ్య చౌదరి హత్య కేసు ఫైనల్‌కు చేరడంతో జిల్లాకు చెందిన టీడీపీ నాయకుల్లో టెన్షన్ మొదలైంది. హత్యలో ప్రధాన సూత్రధారుడిగా చెబుతున్న అమ్మనబ్రోలు టీడీపీ యువనాయకుడితో జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులకు సత్సంబంధాలున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అతడితో రాసుకొని పూసుకొని తిరిగిన దాఖలాలు ఉన్నాయి. దాంతో ఈ కేసు అటు తిరిగి ఇటు తిరిగి చివరికి ఎవరి తలకు చుట్టుకుంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అంతేకాకుండా వీరయ్య చౌదరి అంత్యక్రియలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ హంతకులు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని చెప్పడం, అసలు హంతకులకు ఈ నేల మీద తిరిగే అర్హత లేదనడంతో పోలీసులు ఈ కేసును ఎటు తీసుకెళతారో అర్థంకాక గుబులు చెందుతున్నారు. వీరయ్య చౌదరి హత్యలో నిందితులంతా తెలుగుదేశం పార్టీకి చెందినవారే ఉండడంతో ఇప్పటికే ఆ పార్టీ పరువు పోయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రెవెన్యూ సమస్యలపై బాధ్యతాయుతంగా పనిచేయాలి

- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తి బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశమై ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చిన అర్జీల పరిష్కారం, జిల్లాలో వివిధ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన భూ కేటాయింపుల ప్రతిపాదనలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయని, వచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై క్షేత్ర స్థాయి ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. అర్జీల పరిష్కారంలో భాగంగా క్షేత్ర స్థాయిలో ఎండార్స్‌మెంట్ చేసిన వాటి పరిష్కారం చూపిన విధానం సక్రమంగా ఉందా లేదని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలన్నారు. ముఖ్యంగా రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సక్రమంగా ఎండార్స్‌మెంట్ చేశారా లేదా అని పరిశీలించాలని డివిజనల్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న రెవెన్యూ సమస్యల వివరాలను, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై గ్రామాల వారీగా నివేదికను వెంటనే సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూ కేటాయింపులపై వచ్చిన అర్జీలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు క్షుణ్ణంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావుతో పాటు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

రాచర్లలో బంగారు బాల్యం సర్వే పూర్తి

ఒంగోలు సబర్బన్: బంగారు బాల్యం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన రాచర్ల మండలంలో బంగారు బాల్యం సర్వే పూర్తి చేసినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. అందుకు సంబంధించి మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాచర్ల మండలంలోని పాఠశాలలకు వెళ్లాల్సిన బాల బాలికలను 380 మందిని గుర్తించారన్నారు. వారి కుటుంబాల స్థితిగతులు తెలుసుకొని వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పేందుకు సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే వారికి అవసరమైన వనరుల సమకూర్చాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ సర్వేలో చాలా మంది వికలాంగుల పిల్లలు ఉన్నందున వారికి వీల్ చైర్స్, త్రి సైకిల్స్‌ను సమకూర్చాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. త్వరలో జరగబోయే బంగారు బాల్యం నెలవారీ సమీక్షలో జిల్లా వ్యాప్తంగా బంగారు బాల్యం సర్వేపై తగిన సూచనలు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి పి. సుధా మారుతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్, గిరిధర్ శర్మ, సునీల్ కుమార్ పాల్గొన్నారు.



సర్వే రిపోర్టును ప్రదర్శిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

మార్కాపురంలో కేంద్ర బృందం పర్యటన



కొట్టాలపల్లిలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గం లోని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో మంగళవారం కేంద్ర బృందం పర్యటించింది. 2022 నుంచి 2024 వరకు ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర బృంద సభ్యులైన రాజు, విజయేందర్ పరిశీలించారు. మార్కాపురం మండలంలోని కొట్టాలపల్లి ఎస్సీ కాలనీలో 5 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డు, జమ్మనపల్లి ఎస్సీ కాలనీలో రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు, తర్లుపాడులో రోడ్డు, కొనకనమిట్ల మండలంలోని సలనూతల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను తనిఖీ చేశారు. వీరి వెంట మార్కాపురం పంచాయతీరాజ్ డీఈ రవి ప్రకాష్, ఏఈ విజయ్‌మోహన్‌రాజా, తర్లుపాడు ఏఈ శ్రీనివాసరెడ్డి, కొనకనమిట్ల ఏఈ మహంకాలయ్య ఉన్నారు.

పిడుగుపాటుకు చింత చెట్టు దగ్ధం



మార్కాపురం: పిడుగుపాటుకు చింత చెట్టు నిలువునా దగ్ధమైంది. ఈ సంఘటన మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న చింత చెట్టుపై పిడుగు పడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గ్రామస్తులు ఎవరూ లేక పోవడంతో ప్రాణ నష్టం తప్పింది.

క్రీడాస్ఫూర్తి అవసరం



చిన్నారులతో కలిసి టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: చిన్నారులు ఆటపాటల్లో ఉత్సాహంగా పాల్గొనాలని, పోటీతత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంప్–2025ను ప్రారంభించారు. పిల్లలతో కాసేపు టగ్ ఆఫ్ వార్ ఆడి ప్రోత్సహించారు. క్యాంపులో భాగంగా మొదట ఫుట్‌బాల్ శిక్షణను ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ.. వేసవి క్రీడా శిక్షణ శిబిరం జూన్ 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. రోజూ ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఇస్తారని, పోలీసుల పిల్లలతో పాటు ఇతర చిన్నారులకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

అనంత సాగర ప్రయాణం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రామ్మోహనరావు, సాగర్

ఒంగోలు సబర్బన్: అభాగ్యుల జీవితాల్లో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ కొత్త వెలుగులు నింపారని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీఎస్ రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్‌నగర్‌లోని హెల్ప్ కార్యాలయంలో 'అనంతసాగర ప్రయాణం నా జీవన ప్రస్థానం' పుస్తకాన్ని రామ్మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్ప్ సంస్థలో సామాన్య కార్యకర్తగా జీవనాన్ని ప్రారంభించిన సాగర్.. రెండు దశాబ్దాలుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్, రెవెన్యూ, వివిధ ప్రభుత్వ సంస్థల సమన్వయంతో పనిచేశారన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికుల నివారణ, మానవ అక్రమ రవాణా నిర్మూలన, బాలలపై లైంగిక వేధింపుల నిర్మూలన, దివ్యాంగులు, మానసిక దివ్యాంగుల, నిరుపేదలు, నిరాదరణకు గురైన వృద్ధులను చేరదీయడం.. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ క్రమంలోనే జాతీయ పురస్కారాలు, మరెన్నో ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. సాగర్ దంపతులను హెల్ప్ సంస్థ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కుమారితో పాటు పలువురు పాల్గొన్నారు.

కుట్టు స్కీమ్ కాదు.. రూ.కోట్లు కొల్లగొట్టే స్కామ్

- కుట్టుమిషన్లు, శిక్షణ పేరుతో కూటమి భారీ మోసం
- మహిళలను నిలువునా మోసగిస్తున్నారు
- అధికార యావతోనే చంద్రబాబు అడ్డగోలు హామీలు
- గద్దెనెక్కిన తర్వాత ఒక్కటీ అమలు చేసేది లేదు
- కూటమి నాయకుల దారుణాలను ప్రజలు గమనిస్తున్నారు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు



మాట్లాడుతున్న జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ

ఒంగోలు సిటీ:

మహిళలకు కుట్టుమిషన్లు, శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వ నాయకులు భారీ మోసానికి తెగబడ్డారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ విమర్శించారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహిళా విభాగం నాయకులతో కలిసి ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుంపా రమణమ్మ మాట్లాడుతూ.. కుట్టు మిషన్‌కు కొనుగోలుకు రూ.4300, ఒక వ్యక్తి శిక్షణ నిమిత్తం రూ.3 వేలు వెరసి మొత్తం రూ.7300 ఖర్చు అవుతుందని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం ఒక్కో మహిళకు రూ.23 వేల చొప్పున కేటాయించడం దోపిడీ కాక మరేమిటని ప్రశ్నించారు. వాస్తవంగా లబ్ధిదారులకు అయ్యే ఖర్చు రూ.73 కోట్లు అయితే, కూటమి నాయకులకు రూ.167 కోట్లు దోచిపెట్టేందుకు పథక రచన చేశారని విమర్శించారు. శిక్షణ మొదలైననప్పటి నుంచి 50 రోజుల్లోపే రూ.167 కోట్లు పంచుకు తినేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఒక్కో మహిళా లబ్ధిదారుపై వెచ్చిస్తున్న సొమ్ములో రూ.16,700 కూటమి నేతల జేబుల్లోకి వెళ్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నగదు చెల్లించేవారని, కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితే లేదన్నారు. చంద్రబాబునాయుడు అధికార యావతో అడ్డగోలు హామీలిచ్చారని, గద్దెనెక్కిన తర్వాత ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేసింది లేదని నిప్పులు చెరిగారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1800, 50 ఏళ్లు నిండిన బీసీ మహిళలకు పింఛన్లు, మహిళలకు ఫ్రీ బస్సు, ప్రతి కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇలా ఇష్టారీతిగా హామీలిచ్చి మోసం చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ఆరాచకాలను, మోసాలను ప్రజలు గమనించాలని కోరారు.

హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఒంగోలు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బడుగు ఇందిరా మాట్లాడుతూ.. బీసీ మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో రూ.167 కోట్లు దోపిడీ చేస్తున్న కూటమి పాలకులు, త్వరలోనే కమ్మ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల పేరుతో మరో రూ.81 కోట్లు నొక్కేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ మాట్లాడుతూ.. కుట్టుమిషన్ల పేరుతో జరిగిన అవినీతికి సహకరించిన అధికారుల ఉద్యోగాలు ఊడటం ఖాయమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షురాలు పేరం ప్రసన్న మాట్లాడుతూ.. కుట్టుమిషన్లను పేద మహిళలకు కేటాయించకుండా మోసగించడం దారుణమన్నారు. వలంటీర్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి గోనెల మేరికుమారి మాట్లాడుతూ.. కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మహిళా నాయకులు గోనుగుంట రజని, ముప్పరాజు జ్యోతి, జిల్లా అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ, మద్దిపాడు మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మన్నెం సంధ్య, ఎస్.లక్ష్మీకాంతమ్మ, తొగురు మాధవి, పులిగోటి రాజేశ్వరి, కొమ్మతోటి సంధ్య, దుంపా నాగలక్ష్మి, కుందురు లక్ష్మి, సన్నపురెడ్డి రమణమ్మ, కాకర్లమూడి రజిని తదితరులు పాల్గొన్నారు.

జాతిపిత విగ్రహం తొలగింపులో వివాదం



పాత విగ్రహం తొలగించిన తర్వాత ఏర్పడిన గుంత

- కొండపి మండలం నేతివారిపాలెంలో ఘటన
- పాత విగ్రహానికి 10 అడుగుల దూరంలో కొత్త విగ్రహం పెట్టిన ఓ వర్గం
- పాత విగ్రహాన్ని సోమవారం అర్ధరాత్రి తొలగించేందుకు మరో వర్గం ప్రయత్నం
- పోలీసుల రాకతో సద్దుమణిగిన ఉద్రిక్తత

కొండపి: మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం తొలగింపు వివాదానికి దారితీసింది. గ్రామంలో 60 ఏళ్ల క్రితం గాంధీ విగ్రహాన్ని స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ విగ్రహం శిథిలమైందని భావించిన ఓ వర్గం పాతదానికి పది అడుగుల దూరంలో శనివారం నూతన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే పాత విగ్రహం ఉన్నచోటనే కొత్తది ఉంచాలని లేదంటే ఇటీవల మరమ్మతులు చేయించిన పాత విగ్రహాన్నే కొనసాగించాలని మరో వర్గం వారు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో జేసీబీతో పాత విగ్రహాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో మరో వర్గం వారు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రేమ్ కుమార్ తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. కాగా పాత గాంధీ విగ్రహాన్ని తొలగించి టీడీపీ నాయకుల విగ్రహాలు పెట్టాలని చూస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ వివరణ కోరగా నూతన విగ్రహాన్ని పెట్టడానికి లేదా పాత విగ్రహాన్ని తీసివేయడానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, ఆ స్థలం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుందని తెలిపారు. నూతన బొమ్మతోపాటు పాత బొమ్మకు కూడా అనుమతి లేదని ఆర్‌అండ్‌బీ అధికారి మాధవరావు చెప్పారు.



బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై

వైద్యుల పనితీరుపై పర్యవేక్షణ అవసరం

- వైద్యశాలల పర్యవేక్షకులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రులపై సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి హాజరవుతున్న సమయం, వారి పనితీరుపై పటిష్ట పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఆయా ఆస్పత్రుల పర్యవేక్షకులు ఈ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ ఆసుపత్రుల నిర్వహణపై మంగళవారం ప్రకాశం భవనంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల వారీగా సిబ్బంది ఖాళీలు, రోజువారీ కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు, లేబొరేటరీ, ఎక్స్ రే, స్కానింగ్, ఈసీజీ, బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, విద్యుత్ జనరేటర్ మరమ్మతులు, ఇతర నిర్మాణ పనులు, ఎన్టీఆర్ వైద్య సేవ క్లెయిమ్స్ పరిష్కారం తీరు తదితర అంశాలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలు అందేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపరింటెండెంట్లదే అని కలెక్టర్ స్పష్టం చేశారు. పద్ధతి సరిగా లేని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉన్నతాధికారులనే ధిక్కరించే స్థాయిలో సిబ్బంది ఉంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి వారి వల్ల మొత్తం వ్యవస్థ గాడి తప్పే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది, వైద్యుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస నాయక్, డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తర్లుపాడు : కొండారెడ్డిపల్లిలో బొప్పాయి పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ, ఏఓ



మార్కాపురం : బొప్పాయి తోటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ రమేష్, ఏఓ శ్రీనివాసరెడ్డి

పెనుగాలుల బీభత్సం

- తర్లుపాడు మండలంలో 197 ఎకరాలు, మార్కాపురం మండలంలో 38 ఎకరాల్లో బొప్పాయి తోటలకు నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతుల విజ్ఞప్తి

తర్లుపాడు/మార్కాపురం: పెనుగాలులు బొప్పాయి రైతులను అతలాకుతలం చేశాయి. సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలుల ధాటికి తర్లుపాడు మండలంలో 197 ఎకరాల్లో బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లింది. రాగసముద్రంలో 15 మంది రైతులకు చెందిన 38 ఎకరాలు, కలుజువ్వలపాడు నలుగురు రైతులకు చెందిన 12 ఎకరాలు, జంగంరెడ్డిపల్లిలో 15 మంది రైతులకు చెందిన 38 ఎకరాలు, కలుజువ్వలపాడులో నలుగురికి చెందిన 12 ఎకరాలు, ఓబాయిపల్లిలో 43 మంది రైతులకు చెందిన 61 ఎకరాల్లో, కొండారెడ్డిపల్లిలో 16 మంది రైతులకు చెందిన 31 ఎకరాలు, లక్ష్మక్కపల్లిలో ఐదుగురు రైతులకు చెందిన 19 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే టన్ను రూ.20 వేల నుంచి రూ.5 వేలకు పడిపోయి తీవ్ర నష్టాల్లో ఉన్న బొప్పాయి రైతులను పెనుగాలులు తీవ్ర విషాదంలోకి నెట్టాయి. చెట్టునిండా కాయలతో కళకళలాడుతున్న బొప్పాయి నేలకు వాలటంతో రైతులు బోరున విలపించారు. అప్పు చేసి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు.. పంట చేతికందే సమయంలో నేలకూలడంతో రైతుల నోట మాటరావడం లేదు. మార్కాపురం హార్టికల్చర్ అధికారి రమేష్, ఏఓ వెంకటేశ్వర్లు గ్రామాల్లో నేలకూలిన బొప్పాయి పంటలను పరిశీలించారు.

మార్కాపురం మండలంలోని గజ్జల కొండ పంచాయితీలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు 15 మంది రైతులకు చెందిన 38 ఎకరాల బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లిందని మండల ఉద్యాన వన శాఖాధికారి రమేష్ తెలిపారు. దెబ్బతిన్న తోటలను ఆయనతోపాటు ఏఓ శ్రీనివాసులు, వీఆర్‌ఓ సౌజన్య పరిశీలించారు.

లారీ రాక కోత కోయలేదు



మూడెకరాల్లో బొప్పాయి పంట వేశా. 25 రోజుల క్రితం మొదటి కోతలో 4 క్వింటాళ్ల కాయలు కోశాం. సోమవారం లారీ వస్తుందని వ్యాపారులు సమాచారమిచ్చారు. కానీ లారీ రాలేదు. సాయంత్రానికి పెద్దఎత్తున పెనుగాలులు వీచి తోట మొత్తం నేలకూలింది. రూ.5 లక్షలు పెట్టుబడిగా పెట్టా. తోటంతా దెబ్బతినడంతో పూర్తిగా నష్టపోయా.

– తాడి కాశిరెడ్డి, రైతు, రాగసముద్రం

6 లక్షల రూపాయలు నష్టం



నాలుగెకరాల్లో బొప్పాయి సాగుచేశా. రూ.6 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా. మరో నాలుగు రోజుల్లో పంట కోసేందుకు వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకున్నా. సోమవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు తోట మొత్తం కూలిపోయింది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– దారెడ్డి భాస్కర్‌రెడ్డి, రైతు, రాగసముద్రం

ప్రభుత్వమే ఆదుకోవాలి



మూడెకరాల్లో బొప్పాయి వేశా. పంట చేతికొచ్చిందనుకునేలోపే సోమవారం వీచిన గాలివానకు పంట మొత్తం నేలవాలింది. గ్రామంలో మొత్తం 43 మంది రైతులం కలిసి 61 ఎకరాల్లో బొప్పాయి సాగుచేశాం. పంట మొత్తం కూలిపోయింది. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం ఆదుకోకుంటే అప్పుల్లో కూరుకుపోతాం.

– జగన్, రైతు, ఓబాయపల్లి

కూటమి నేతలకు రొక్కం.. కూలీలకు దుఃఖం

- మస్టర్‌కు రూ.300 వసూలు
- అధికారులు, కూటమి నేతలు కలిసి రూ.కోట్లు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు
- ప్రశ్నిస్తారని సమావేశాలకు డుమ్మా కొడుతున్న అధికారులు
- తీవ్ర చర్యగా పరిగణిస్తామన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

యర్రగొండపాలెం: ఉపాధి కూలీల కష్టార్జితాన్ని కూటమి నాయకులు, అధికారులు దోచుకుంటున్నారు. ఒక్కొక్క మస్టర్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 89,922 జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 53,010 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. పనులు చేసే కూలీలు మస్టర్ వేయించుకునేందుకు వారానికి రూ.300, పనులు చేయకుండా మస్టర్లు వేయించుకునేవారు రూ.500 ప్రకారం ముందుగానే చెల్లించాలని కూటమి నేతలు స్పష్టం చేయడంపై దుమారం రేగుతోంది. ఎంపీడీవోల కనుసన్నల్లో ఈ అవినీతి భాగోతం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా మండలాల ఏపీవోలు ముఖ్య భాగస్వాములుగా ఉంటున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. కూలీల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని మూడు భాగాలుగా విభజిస్తారని, అందులో ఒక భాగం నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుడికి, రెండో భాగం ఎంపీడీవోకు, మూడో భాగం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి చెందేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది.

వారానికి రూ.150 కోట్లు వసూలు

ప్రస్తుత లెక్కల ప్రకారం వారానికి దాదాపు రూ.1.50 కోట్ల ప్రకారం రెండు వారాలకు కలిపి దాదాపు రూ.3 కోట్లు ఆయా మండలాల్లో పనులు చేసే కూలీల నుంచి వసూలు చేసినట్లు సమాచారం. ఈ విధంగా ఒక్కొక్క కూలీ వంద రోజుల పనిదినాల ప్రకారం 16 వారాల పాటు పనులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి వలస వెళ్లినవారు పాల్గొనడం లేదు. ఇతర పనులకు వెళ్లేవారు తమ పనిదినాలు పూర్తి చేసుకోవటానికి ఉపాధి హామీ పనులకు ఆలస్యంగా వస్తున్నారు. వీరిని కూడా కలిపితే దాదాపు లక్ష 60 వేల మంది నియోజకవర్గంలో ఉపాధి పొందే జాబితాలో ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం 16 వారాలకు కలిపి రూ.76.80 కోట్లు కూలీల నుంచి వసూలు చేశారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ దోపిడీని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతోనే యర్రగొండపాలెం, పెద్దదోర్నాల మండల పరిషత్ సమావేశాలు జరగకుండా ఎంపీడీవోలు, అధికారులు డుమ్మా కొడుతున్నారన్న చర్చ నడుస్తోంది.

కూలీల కష్టార్జితాన్ని పచ్చ దొంగల ముఠా దోచుకుంటోంది



ఉపాధి హామీ నిధులను సైతం టీడీపీ దొంగల ముఠా దోచుకుంటోంది. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు ఒక ముఠాను తయారు చేసుకొని కూలీల డబ్బు దోచుకునేలా ప్రోత్సహిస్తున్నారు. దీనికి నియోజకవర్గంలోని 5 మండలాల ఎంపీడీవోలు పూర్తి సహకారం అందిస్తున్నారు. ఒక్కో కూలీ నుంచి రూ.300, పని చేయకుండా మస్టర్లు వేయించుకునేవారి నుంచి రూ.600 ప్రకారం వసూలు చేసుకుని పంచుకుంటున్నారు. టీడీపీ దొంగల ముఠా, అధికారులు కలిసి వారానికి రూ.3 కోట్లు ప్రకారం వసూలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కోట్ల రూపాయల ధనాన్ని అడ్డదారుల్లో పందికొక్కుల్లా మెక్కుతున్న వ్యవహారాన్ని ప్రశ్నించే వారిని, వైఎస్సార్ సీపీకి ఓటు వేసిన వారిని పనుల నుంచి తొలగిస్తున్నారు. ఇటీవల యర్రగొండపాలెం మండల పరిషత్ సమావేశంలో ప్రశ్నిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీని ఎంపీడీవో అగౌరవపరిచారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ధనదాహంతో అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

– తాటిపర్తి చంద్రశేఖర్, యర్రగొండపాలెం ఎమ్మెల్యే